# మృగతృష్ణ

"నాకో సాయం చేస్తారూ" ఎప్పుడూ చిలిపిగా - అల్లరిగా నవ్వే కళ్ళల్లో నేనిష్టపడని నీలినీడలు.

"ఇంత విషం తెచ్చిపెట్టండి. ప్రశాంతంగానైనా చచ్చిపోతాను"

ఉలిక్కిపడ్డాను. నాలో ఆశ్చర్యంతోపాటు కొద్దిపాటి భయం- జలదరింపులా వెన్నంతా పాకింది.

విషాదంలా అల్లుకున్న ఆ సంజె చీకట్లో - భీమ్లీ సముద్రపు అలలు రాళ్ళను ఢీ కొంటూ విరిగి - ఒరిగిపోయేటపుడు చేసే శబ్దం - అందులో మిళితమౌతూ సన్నని ఏడుపు.

"కానీ ఓ విషయం మాత్రం గుర్తుంచుకోండి. నేను చావటం జరిగితే అందులో మీ బాధ్యతా ఉంటుంది" వెక్కిళ్ళను బలవంతంగా నొక్కిపడుతూ -గీత.

పరిచయమైన కొత్తల్లో - పొర్లుతూ, తుళ్ళుతూ ఎదురొచ్చిన గండుశిలల్ని సైతం దాటుకుంటూ ప్రవహించే కొండవాగులా ఉండేది గీత. ఆత్మస్థైర్యంతో - గుండె నిబ్బరంతో మాట్లాడే ఆ గీతకూ - నేడు నా ఎదురుగా దైన్యానికి ప్రతిరూపంలా ఉన్న గీతకూ ఎంత వ్యత్యాసం !

చాలా మెల్లగా -అనునయిస్తున్న ధోరణిలో తన చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను. ఆ చేయి మృదువుగా - వణుకుతో నా చేతులమధ్య నిశ్చలత్వాన్ని వెదుక్కుంటోంది.

"ఏం చేయమంటారు నన్ను - ఓ వైపు మీరూ - మరోవైపు...."

"నన్నెక్కడికయినా తీసుకుపొండి - దూరంగా - ఈ క్రూరత్వానికీ - పశుత్వానికీ - అమానుషత్వానికి - సుదూరంగా ..." నా మాట పూర్తి కాకుండానే జవాబిచ్చింది గీత.

అటువంటి వాతావరణంలోనూ నవ్వొచ్చింది నాకు,

"ఎంత పసితనం!"

"అదే వద్దన్నాను. నాదికాదు పసితనం - మీదీ పసితనం - పిరికితనమూను" ముక్కుపుటాలు అదుర్తూ - ఉధృతమైన సముద్రపు అలల మల్లే ఆవిడ ఒత్తైన జుట్టు గాలికి విసురుగా నన్ను తాకసాగింది.

"సమాజాన్నీ - ఎదుర్కోబోయే సమస్యల్నీ - మన భవిష్యత్తునీ దృష్టిలో పెట్టుకుని ప్రవర్తించడాన్ని నేను పిరికితనమనుకోను. మీరంటే నాకు చాలా యిష్టం కానీ..."

"ఆగండి. యిష్టమూ - ప్రేమ.. వీటిమీద నాకట్టే నమ్మకం లేదు. మీరంటే నాకు చాలా ప్రేమనో - మీరు లేనిది బ్రతకలేననో చెప్పి, మిమ్మల్ని నమ్మించి, ఆత్మ వంచన చేసుకోను. అలాగని నేనంటే మీరు పడి చస్తారనీ భ్రమించను. నేను కోరేది మీతోడు - ఆసరా. నన్ను మనిషిగా మీరు గుర్తిస్తారన్న ఆశతో పెంచుకున్న స్వార్థపు కోరిక. యిపుడు బ్రతికే బ్రతుకుని అసహ్యించుకుంటూ - వాళ్ళ నీచత్వానికీ - హీనత్వానికీ అందకుండా బ్రతకాలనే పట్టుదలలోంచి పుట్టిన అభిప్రాయం" ఆవేశం ఆపుకోడానికి ఆగింది తను.

"పరిస్థితుల్నించి పారిపోవాలని ఎందుకు ప్రయత్నిస్తారు ? మార్చుకోవచ్చుగా"

"ఆఁ మార్చుకోవచ్చు - మనుషులే అయితే - అవి మృగాలు .. నా బాధా - ఆవేదనా - ఆత్మ నివేదన - ఇవన్నీ అర్థమైతేగా. నన్ను సహృదయంతో అర్థం చేసుకునే ఆత్మీయులూ - స్నేహితులూ మీరొక్కరే. అందుకే పరిష్కారాన్ని మీలో వెతుక్కునే తాపత్రయంతో ఇన్నాళ్ళు ఆగాను. మరో రెండ్రోజులు ఆగుతాను. - మీ జవాబు కోసం"

గీత లేచి నిలబడింది - ఆగమని పిలుస్తున్నా విన్పించుకోకుండా విసురుగా వెళ్ళిపోయింది. ఆ చీకటిలో - ఉప్పెనలా - వెల్లువలా ....

ఒంటరిగా - సముద్రపుహోరు వింటూ - గీతలోని ఆవేశంలా పొంగుకొచ్చే అలల్ని చూస్తూ కూచున్నాను.

రెండ్రోజుల టైం యిచ్చి పోయింది గీత. తనలో సహనం ఎపుడో చచ్చిపోయి ఉంటుంది. మొదట్లో గీత అలా అడిగినపుడు ఆవేశంలోనో, ఉద్రేకంలోనో - అమాయకత్వం

లోనో అలా అంటుందనుకునే వాడిని... ఆ తర్వాత చాలా మెల్లగా పరిస్థితుల నిజ స్వరూపం అర్థమైంది. గీత పరిచయమైనప్పటి రోజులు జ్ఞాపకానికి వచ్చాయి.

ఎలా ఉండేదని - గీత - మధుతుషారంలా సమ్మోహనంగా నవ్వుతూ - వనమయురంలా సయ్యాటలాడుతూ - పసిపాపలా అల్లరిచేస్తూ - తనని మొట్టమొదటిసారి చూసినపుడు తను ముకుళిత హస్తాల్తో - కళ్ళల్లో కుతూహలాన్ని నింపుకుని చూసినపుడు - ఆ చూపు - ఒకే ఒక చూపు! పరిచయాలు దైవ నిర్ణయాలనుకుంటాను.

భీమ్లీ స్కూలుకు బదిలీ అయిన కొత్తల్లో చాలా సంతోషపడ్డాను. నీలాకాశం - తెలి మబ్బులూ - సంజెరంగులూ - చూస్తూ ఇసుక తిన్నెలమీద - సముద్రపు ఒడ్డున - అలా గంటల తరబడి కూచోవటం నాకెంతిష్టమో.

మా కొలీగ్స్‌లో నన్ను అమితంగా ఆకర్షించిన వ్యక్తి విశ్వనాధం - చక్కటి స్ఫురద్రూపి - ఎప్పుడూ వెన్నెల్లా హాయిగా నవ్వుతూ - అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ -ఎంత చక్కటి కళ్ళు - ఆడవాళ్ళకుండాల్సిన అందమైన, వెడల్పాటి కళ్ళు - అతనికి ముప్పయ్ మూడేళ్లని చెబితే ఎవరూ నమ్మరు. పాతికేళ్ళ కుర్రాడిలా చలాకీగా ఉంటాడు. నున్నటి తెల్లటి బుగ్గలు -అమాయకమైన మొహం - అమ్మాయిని చేయబోయి హఠాత్తుగా అబ్బాయిని చేసేసినట్లు -

పరిచయం స్నేహంగా మారాక విశ్వనాధం ఎన్నోసార్లు తన యింటికి రమ్మని పిల్చినా ఏదో ఓ కారణం చెప్పి తప్పించుకునే వాడిని - అద్వితీయమైన సాయంకాలాల్ని నాల్గుగోడల మధ్య పనికిరాని కబుర్లతో ఖూనీ చేయడం యిష్టం వుండదు నాకు.

కానీ పల్లెటూరి వాతావరణం సంతరించుకున్న భీమ్లిలో ఎక్కువకాలం ఎవరి నుంచయినా తప్పించుకోవడం కష్టమేనని తెల్సిపోయిందో రోజు.

ఆరోజు సాయంత్రం సముద్రపు ఒడ్డున కూచుని, నీటిమీద తేలియాడే రంగుల కలయికల్ని గమనిస్తున్నాను.

"నమస్తే" పరిచయమైన కంఠం.

తలెత్తి చూస్తే ఎదురుగా విశ్వనాధం.

"వీరే మా స్కూల్లో కొత్తగా చేరిన మాష్టారు" పక్కన ముగ్ధ మనోహరంగా ముకుళిత హస్తాల్తో - గీత.

నాకు దగ్గిరగా కూర్చున్నారిద్దరూ.

సూర్యాస్తమయపు అరుణిమ ఆవిడ కపోలాలమీద పడి మెరుస్తోంది.

విశ్వనాథం మంచి మాటకారి. మాట్లాడటమే కాదు - ఎదుటివ్యక్తి ఎంతటి ముభావి అయినా అతనిచేత మాట్లాడించగల నేర్పరి కూడ. ఆ కొద్దిసేపూ కబుర్ల కాక్‌టెయిల్ తయారయి పోయిందక్కడ.

అపుడే పరిచయమైన వ్యక్తి అయినా - తెచ్చిపెట్టుకున్న సిగ్గూ బిడియాల చాటున తన ఉత్సాహాన్ని దాచేయకుండా హిపోక్రసీలేకుండా స్వేచ్ఛగా మాట్లాడిన గీతంటే - ఓ రకమైన ఇష్టం నాలో.

"ఎపుడూ మేమేనా మాట్లాడేది - మీరేమైనా చెప్పండి" అని శూన్యంలోకి చూస్తున్న నన్ను చూసి "పోనీండి పదానికి పావలా చొప్పున ఇస్తాను" అంటూ "బాబోయ్ అక్షర లక్షలు మాత్రం అడక్కండి" అని ఫక్కున నవ్వినపుడు యిసుక రేణువుల్లో సైతం తన్మయత్వంతో కూడిన కదలిక.

"పాట పాడు గీతూ" అని విశ్వనాథం అడిగినపుడు "ఆయన పారిపోరుగా" అంటూ కళ్లనిండా అల్లరి - చిలిపితనం నింపుకొని నావైపు చూస్తూ - ఓహ్! ఎంత తీయటిగొంతు - శ్రావ్యంగా మధురంగా - నాకలానే - ఆ తీరంలో - తన పాట వింటూ యుగాల తరబడి ఉండిపోవాలనిపిచింది.

ఆ కోరికేననుకుంటూ - మరుసటిరోజు విశ్వనాథం పిల్చినపుడు నన్ను అనాయాసంగానే వాళ్ళింటికి లాక్కెళ్ళింది.

ఆ తర్వాత అదో దినచర్యగా మారడానికి అట్టేకాలం పట్టలేదు. ఇన్నాళ్ళూ సాగరతీరం లోని అందాన్ని ఆస్వాదించాను. ఇపుడు గీత సామీప్యంలో వుండే ఆనందాన్ని అనుభవిస్తున్నాను.

"మీతో నా సెక్స్ అనుభవాలు ఎలా ఉన్నాయో చెప్పమంటూ రాత్రంతా మా వారు వేధించారు తెలుసా" అని ఓరోజు గీత చెప్పినపుడు భయంకర విస్ఫోటంలో ఎగిరిపడే రేణువుల్లా మనసంతా చెల్లాచెదరైంది. హృదయంలో లోతుగా గాయమైనంత బాధ - విశ్వనాథం యిలా అపార్థం చేసుకుంటాడని కలలోకూడ అనుకోలేదు.

"వేధించడమంటే పోట్లాడారనుకుంటున్నారా? వుహుం- పోట్లాడటం - తిట్టటం - కొట్టడం వారికి చాతకాదు. చాలా మంచిమనిషి - మీరిష్టపడతారే - వెన్నెల్లా హాయిగా నవ్వుతూ - అలా - అనునయిస్తూ - బుజ్జగిస్తూ అడిగారు"

"అంత సీరియస్ విషయాన్ని అలా జోక్ చెప్పినట్లు చెప్తారేం" కొద్దిగా విసుక్కున్నాను.

"మరేం చేయమంటారు? ఏడ్వమంటారా - అయినా - అందంగా - అమాయకంగా కన్పించే ఓ వ్యక్తికి సంబంధించిన అనూహ్యమైన -అద్భుతమైన విషయాలు తెల్సుకుంటున్న రెండో వ్యక్తిని నేను. ఎంత థ్రిల్లింగ్‌గా ఉందో తెలుసా - నమ్మటం జరిగితే మీరు మూడో వ్యక్తి అవుతారు" విషాదమో-వినోదమో తెలీని అనిశ్చిత భావం గీతలో.

గీత విశ్వనాధానికి రెండో భార్య... మొదటి భార్య బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆవిడను చాలా ప్రేమగా చూసేవాడట విశ్వనాథం. వాళ్ళిద్దరూ పోట్లాడుకోవటం అన్నేళ్ళ వాళ్ళ సంసారంలో ఎవ్వరూ చూడలేదుట - వినలేదుట - మాస్టాఫ్ రూంలో చెప్పుకునే దాన్ని బట్టి ఆవిడకు ఎవరితోనో ఉన్న అక్రమ సంబంధం విశ్వనాథం కళ్ళబడిందనీ - ఆవిషయం భరించే శక్తి లేక - ఎదురుపడే ధైర్యంలేక ఆత్మహత్య చేసుకుందని తెల్సింది.

మరునాడు స్టాఫ్‌రూంలో విశ్వనాథం కన్పించినప్పుడు గీత చెప్పిందంతా నిజం కాదనిపించింది. చాలా మృదువుగా - ఆప్యాయంగా మాట్లాడాడు. బలవంతంగా యింటికి పిల్చుకెళ్ళాడు. భోజనానికి ఉండిపొమ్మని బ్రతిమాలాడు.

అదే విషయం చెప్పినప్పుడు దెబ్బతిన్న ఆడపులిలా చూసింది గీత.

"ఎలానమ్మగలరూ - అదే ఆయనలోని గొప్పతనం. అమాయకమైన మొహం -తీపి మాటలు ఆయన సహజ కవచాలు" గీత శోకదేవతలా - ఆ కనురెప్పల మీద పృథ్విని

మోస్తున్నంత బరువుగా వాల్చేసి చెప్పింది.

"మీకు చెప్పింది చాలా తక్కువే. ఈ గుండెల్లో దాచుకున్నవే ఎక్కువ. ఒక్కోసారి ఏమనిపిస్తుంది చెప్పనా - ఆయన బాగా కోప్పడి కొట్టి చంపేస్తే బావుండుననిపిస్తుంది. యిలా మాటల్తో- మెల్లమెల్లగా - స్లో పాయిజన్‌లా నా మెదడునీ - రక్తకణాల్ని విషపూరితం చేస్తూ - కిద్ది కొద్దిగా చంపుతూ - ఆనందించకుండా"

"అలా చేయడం వల్ల అతనికి ఒరిగేదేముంది"

"ఎందుకులేదూ - అలామాటల్తో హింసించేటప్పుడు చూడాలి ఆయన మొహం - అఖండ తేజస్సుతో వెలిగిపోతూ ఉటుంది. అదో సరదా, ఓ ఆట - ఆ సరదాకే ఓ స్త్రీ బలైపోయింది. నేనంత పిరికిదాన్ని కాదు. ఆ అవకాశం అతనికివ్వను". గీత కళ్ళలో విశ్వనాథం అంటే అంతులేని అసహ్యం.

ఓసారి అనుకోకుండా మా వూరు వెళ్ళాల్సి వచ్చింది. వెళ్ళేముందు గీతకు చెప్పే అవకాశం దొరకలేదు. నాకోసం తను సముద్రపువొడ్డున - సరుగుడు చెట్ల దగ్గిర - ఒంటరిగా కూచుని ఎదురుచూస్తూ ఉంటుందన్న భావన నన్ను అశాంతిలో ముంచేసేది.

అనవరతం ఘోషిస్తూ - ఆక్రోశిస్తూ - ఆవేశంతో ఎగసిపడుతూ - అంతులేని అశాంతిని మోస్తున్నట్లు - గంభీరంగా అర్థంకాని ప్రవల్హికలా అనేకానేక వింతల్ని దాచుకున్న, ఆ అనంత జలనిధికీ - గీతకూ చాలా సారూప్యం కనిపిస్తుంది నాకు.

సాయంకాలమైతే చాలు - సముద్రపుగాలి సరుగుడు చెట్లలో దూరి చేసే అల్లరి - అల లతాంగి కప్పుకున్న వలువ తెలి అంచులా మెరిసే నురగా - అందమైన గీతస్వరం - ఒక్కోసారి మందంగా - ఒక్కోసారి ఆవేశంగా - కళ్ళు మెరుస్తూ - మమ్మల్ని దాచుకునే చీకటి - ఎంతకాలమని వీటికి దూరంగా బ్రతగ్గలను? వారం తిరక్కుండానే భీమ్లీ వచ్చేశాను.

గీత జబ్బుపడిన దానిలా - నీరసంగా - పేలవంగా కనిపించింది. చెప్పి వెళ్ళినా - అసలు వెళ్ళకుండా ఉన్నా బావుండేది.

"విశ్వనాథాన్ని వదిలేద్దాం అనుకుంటున్నాను" సూటిగా నా వైపే చూస్తూ చెప్పింది -

అదే తను మాట్లాడిన మొట్టమొదటి వాక్యం కావడం నన్ను కలవరపరచింది.

"వదిలేసి..."

"మీరున్నారుగా - మీదగ్గిరకు వచ్చేస్తాను" బాధతోకూడిన నవ్వు.

"ఎందుకిలాంటి నిర్ణయానికొచ్చారు"

"చెప్పాలా మీకు ? చెప్తేకాని అర్థం కాదా! చెప్పకూడనివి, చెప్పలేనివి ఉండొచ్చని కూడా అనిపించదా మీకు - పైకి నవ్వగలుగుతున్నాను కాబట్టి అటువంటి నిర్ణయం తీసుకోవాల్సిన అగత్యం లేదనే అనుకుంటున్నట్లున్నారు. ప్చ్ - అతనిదొకరకమైన హిపోక్రసీ - అమాయకత్వాన్ని కప్పుకున్న క్రూరత్వం - నాదో రకమైన హిపోక్రసీ - నవ్వు వెనుక దాచేసుకునే ఏడుపు - చూపించనా మీకు - అతని సరదాలకున్న కోరలూ - కొమ్ములూ - అవి చేసిన గాయాలూ..."

తన అరచేతులు రెండూ చాపి నా ఎదురుగా పెట్టింది. ఆ తెల్లటి - అందమైన అరచేతుల మధ్యలో నల్లటి కాలిన మచ్చలు - కొన్ని మానిపోయి - కొన్ని పుండ్లలా పచ్చిగా...

గీత ఏడుస్తోంది "యిపుడు చెప్పండి.. యింకా కాపురం చెయ్యమంటారా - మీరు చూసింది చాలా సాధారణమైన విషయం - అతి ఘోరమైనవి - మీకు నేను చెప్పలేనివి - చూపించకూడనివి - ఎన్నో"

ఆ షాక్‌నించి తేరుకోడానికి చాలా టైం పట్టింది నాకు.

"మానసికమైన జబ్బేమో - డాక్టరుకి చూపిస్తే..."

"వుహూ.. ఆ విషయంలో శ్రద్ధ చూపించరు - ఎవరి స్వార్థం వారిది. వాళ్ళ అమ్మానాన్నకూ లాభమేగా-మొదటి పెళ్ళితో వచ్చిన కట్నంతో ఓ అమ్మాయిని అత్తారింటికి పంపించారు. నేను తెచ్చిన కట్నంతో రెండో అమ్మాయి పెళ్ళిచేశారు. ఇపుడు మరో అమ్మాయి పెళ్ళికి ఎదిగి ఉందిగా-" గీత కళ్ళలో అంతులేని భయం.

ఇదంతా జరిగి రెణ్ణెల్లుదాటింది. ఈ మధ్యలో కనీసం పదిసార్లయినా గీత ఈరోజు చెప్పినట్లే తన సమస్యకు పరిష్కారం వెతకమని చెప్పి ఉంటుంది...

గీత అలా కోపంగా రెండ్రోజుల గడువిచ్చి వెళ్ళిపోవడమూ - నేను నాధోరణిలో ఏదో నచ్చ చెప్పడానికి ప్రయత్నించడమూ.... ఈ సమస్యకు పరిష్కారం గీత అనుకునేది మాత్రం కాదని నా నమ్మకం.

ఏ వ్యక్తీ స్వతహాగా దుర్మార్గుడు కాదు - చిటికెడు సానుభూతి - పిడికెడు ప్రేమతో పాటు కావల్సినంత సహనం చూపించగలిగితే ఏ వ్యక్తినయినా మార్చవచ్చనుకుంటాను.

అప్పటికి చాలా చీకటి పడటంవల్ల జ్ఞాపకాల నించి బైటపడి ఇంటిముఖం పట్టాను.

★★★

రెండ్రోజుల తర్వాత గీతకోసం ఎదురు చూస్తూ - సముద్రపు ఒడ్డున మనుషుల రద్దీ వుండే ప్రదేశానికి చాలా దూరంగా - మా కిద్దరికీ అలవాటైన చోట కూచున్నా.

సూర్యుడు పశ్చిమాన వాలిపోయాడు. చుట్టూ చీకట్లు అలుముకుంటున్నాయి. గీత రాలేదింకా- కోపం వచ్చి ఉంటుందేమో ననిపించింది. అయినా గీతకు కోపం రానిదెప్పుడూ నా మీద?

అలలు శబ్దం చేస్తూ - రాళ్ళను ఢీ కొంటున్నాయి. అమావాస్యలా వుందీరోజు.

లేచి తీరం వెంబడి నడుచుకుంటూ బయల్దేరాను. చాలా దగ్గిరకు వచ్చాక కాని గుర్తుపట్టలేదు గీతను. తను నాకు ఎదురువస్తోంది.

"ఇంతాలస్యమైందేం"

"అవును చాలా ఆలస్యమైంది" గీత గంభీరంగా ఉంది.

ఇద్దరం చీకట్లో నడుస్తున్నాం... ఎవ్వరం మాట్లాడటం లేదు. ఎవరి ఆలోచనల్లో వాళ్ళుండి పక్కపక్కన రోడ్డువైపుకు నడుస్తున్నాం.

హఠాత్తుగా గీత "నేను వెళ్తున్నాను" అంటూ విసురుగా నను దాటుకుంటూ వేగంగా నడవటం ప్రారంభించింది.

ఆపినా ప్రయోజనం ఉండదని తెలుసు.

అందుకే ఆపే ప్రయత్నం చేయలేదు.

తనే మెల్లగా పరిస్థితుల్ని అర్థం చేసుకుంటుందన్న ఆశ వుంది నాకు. ఏదో ఓ నాటికి కాలమే తన సమస్యని పరిష్కరిస్తుంది.

రోడ్డు మీదికి వచ్చాను. మెల్లిగా యింటివైపు బయల్దేరాను.

ఓ కుర్రాడు పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు "విశ్వనాథం మాష్టారి భార్య స్టవ్ అంటుకుని కాలిపోయిందని"

పరుగెత్తాను - పిచ్చిగా - వెర్రిగా - ఆవేశంగా.

విశ్వనాథం - అతని అమ్మా, నాన్న అందరూ ఏడుస్తున్నారు వెక్కి వెక్కి.

చూడు - అమాయకమైన మొహంతో - అందమైన కళ్ళతో ఎలా ఏడుస్తున్నాడోవాడు - రాక్షసుడు - బాస్టర్డ్ - బీస్ట్...

"విశ్వనాథం మాష్టారులాంటి మంచి వాళ్ళకే కష్టాలొస్తాయి. విధి వైపరీత్యం కాకపోతే పెళ్ళై యేడాది కాకుండానే స్టవ్ ప్రమాదంలో చనిపోవడం ఏమిటి" ఎవరో అంటున్నారు గుంపులోంచి.

"ప్రమాదమా అది - హత్య - కోల్డ్ బ్లడెడ్ మర్డర్..

ఇద్దరం కలిసి చంపేశాం గీతని.. వెన్నెల్లా నవ్వుతూ సరదాకోసం వాడూ - పిరికితనంతో - సంఘం - కట్టుబాట్ల కోసం నేనూ...

నానా తంటాలుపడి ట్రాన్స్‌ఫర్ తెప్పించుకుని భీమ్లీవదిలి వచ్చేశాను. ఆ సముద్రపు ఒడ్డు సరుగుడు చెట్లు - సాయంకాలాలు అంటే అసహ్యం వేయడం ప్రారంభించింది. అందంగా - అమాయకంగా ఉండే మొహాలన్నా..

నేనొచ్చేసిన కొన్ని నెలలకు నాకో శుభలేఖ వచ్చింది. విశ్వనాథం పెళ్ళి....

● స్వాతి సపరి వారపత్రిక 6 సెప్టెంబర్, 1985 ●